క్లుప్తంగా

ఘనంగా 'మొహుతుర్' పూజలు


సంప్రదాయ ఆటలాడుతున్న చిన్నారులు

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీ గిరిజన గూడేల్లో సంస్కృతి, సాంప్రదాయాలు అద్దంపట్టేలా పూజలు కొనసాగుతున్నాయి. వర్షాలు కురువడంతో వ్యవసాయ పనులు చేసేందుకు గిరిజనులు సిద్ధమవుతున్నారు. శుక్రవారం మండలంలోని ఏంపల్లి గోండుగూడలో విజంగ్ మొహుతుర్ పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు, మహిళలు సాంప్రదాయ నృత్యాలు చేశారు. విత్తనాలకు పూజలు చేసిన అనంతరం వ్యవసాయ పనులను శ్రీకారం చుట్టినట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

'శక్తిఅభియాన్' సమావేశంలో ఆత్రం సుగుణ


సమావేశంలో పాల్గొన్న ఆత్రం సుగుణ

ఉట్నూర్‌రూరల్: హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శుక్రవారం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆధ్వర్యంలో శక్తిఅభియాన్, ఇందిరా ఫెల్లోషిప్ కోఆర్డినేటర్లతో నిర్వహించిన సమావేశంలో ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి, శక్తిఅభియాన్ లోక్‌సభ కోఆర్డినేటర్ ఆత్రం సుగుణ పాల్గొన్నారు. సమావేశంలో కోఆర్డినేటర్లు కృష్ణవేణి, ఇందిరాబాయి, కుంరం సింధు, కనక ప్రతిభ, లక్ష్మిబాయి తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటాలి'


అనిల్‌జాదవ్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

తలమడుగు: త్వరలో జరుగనున్న స్థానికసంస్థల ఎన్నికలలో బీఆర్‌ఎస్ సత్తాచాటాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కుచులపూర్ గ్రామంలో నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తల సన్మానసభలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఏ పల్లెకు వెళ్లినా మళ్లీ కేసీఆర్ సీఎం కావాలంటున్నారని పేర్కొన్నారు. నాయకులు వెంకటేష్, కేదరేశ్వర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, అభిరామ్‌రెడ్డి, తిరుమల్‌గౌడ్, రాములు, దేవ్‌రావు, శ్రీనివాస్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి'


మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్త రాజేందర్ రెడ్డి

సిరికొండ: వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు అన్నారు. మండలంలోని పోచంపల్లి గ్రామంలో శుక్రవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంలో శాస్త్రవేత్త డా.ఎం రాజేందర్ రెడ్డి మాట్లాడారు. ఈసందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. యూరియా, డీఏపీ వంటి ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వాడకం పెంచాలన్నారు. మండల వ్యవసాయాధికారి శ్రద్ధా రాణి, ఏఈవో దీపక్, రైతులు పాల్గొన్నారు.

నేరడిగొండ: భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా అవసరం మేరకు రసాయనాలు వినియోగించాలని అసోసియేట్ ప్రొఫెసర్ జి.అనిత అన్నారు. శుక్రవారం మండలంలోని వడూర్ గ్రామ రైతువేదికలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులు ఎరువుల యాజమాన్య పద్ధతి పాటించాలన్నారు.మండల వ్యవసాయ అధికారి కృష్ణవేణి వానాకాలం పత్తి విత్తనాలపై అవగాహన కల్పించారు. డాక్టర్ కె.కుమారస్వామి, జె.రాకేశ్, రాథోడ్ సందీప్, సీహెచ్ ప్రశాంత్, స్వర్ణలత, సౌజన్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నలుగురు విత్తన డీలర్లపై కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణానికి చెందిన నలుగురు విత్తన డీలర్లపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. పట్టణానికి చెందిన నితిన్ అర్గుల్‌వార్, నాగర్‌కల్ దెవేందర్, అడ్డి చంద్రశేఖర్, అడ్డి మధుకర్ అనే విత్తన డీలర్లు నిబంధనలకు విరుద్ధంగా పత్తి, మొక్కజొన్న విత్తనాలను మహారాష్ట్రకు తరలిస్తున్నారని వ్యవసాయాధికారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

వంతెన పనులు పూర్తయ్యేదెప్పుడో..!


తాత్కాలిక వంతెనపై ప్రవహిస్తున్న నీరు

- ప్రారంభం కాని హైలెవల్ వంతెన నిర్మాణ పనులు
- టెండర్ ఖరారై ఏడాది పూర్తి
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు
- వర్షాలు కురిస్తే తాత్కాలిక వంతెనపై రాకపోకలు బంద్

సాత్నాల: జిల్లాలోని భోరజ్ మండల కేంద్రం సమీపం నుంచి బేల మీదుగా మహారాష్ట్రకు రోడ్డును కేంద్ర ప్రభుత్వం జాతీయరోడ్డుగా ప్రకటిస్తూ విస్తరణకు నిధులు విడుదల చేసింది. పనులు కూడా ప్రారంభమయ్యాయి. కానీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల పట్టింపులేనితనంతో తర్నం వద్ద చేపట్టాల్సిన వంతెన పనులు ఇప్పటికీ మొదలు కాలేదు. వర్షాలు కురుస్తున్నందున ఇప్పట్లో పనులు మొదలయ్యే అవకాశం లేదు. కోట్లాది రూపాయలు వెచ్చించి తాత్కాలిక వంతెన నిర్మించినా చిన్నపాటి వర్షానికే మునిగిపోయి రాకపోకలు నిలిచిపోతున్నాయి.

ప్రారంభంకాని పనులు

భోరజ్ మండల కేంద్రం నుంచి బేల మండలం ఉపాస్‌నాల వరకు 33 కిలోమీటర్లతో విస్తరించిన ఆర్‌అండ్‌బీ అంతర్రాష్ట్ర రోడ్డును నాలుగేళ్ల కిందటే నేషనల్ హైవేగా మార్చారు. మహారాష్ట్రలోని చంద్రపూర్, ఆదిలాబాద్ జిల్లాలోని బేల, జైనథ్, ఆదిలాబాద్‌రూరల్, భీంపూర్ మండలాల మీదుగా, తిరిగి మహారాష్ట్రలోని మాహోర్ వరకు నాలుగు వరుసల జాతీయ రహదారిగా విస్తరించాలని కేంద్రం నిర్ణయించింది. మహారాష్ట్ర వైపున ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుందనే ఉద్దేశంతో అటు నాలుగు లైన్లకు అనుమతించింది. ఆదిలాబాద్ జిల్లా వైపు ట్రాఫిక్ తక్కువగా ఉందనే కారణంతో ఉపాస్‌నాలా నుంచి భోరజ్ వరకు రెండు వరుసలకు కుదించింది. రోడ్డు నిర్మాణం కోసం రూ.360 కోట్లు కేటాయించిన కేంద్రం గతేడాది మే నెలలో టెండర్లు నిర్వహించింది. మహారాష్ట్రకు చెందిన కాంట్రాక్టర్ రోడ్డు పనులను ఏడు నెలల క్రితం ప్రారంభించారు. ఆ పనులు సాఫీగా సాగుతున్నాయి. ఇదే రోడ్డుపై తరోడ గ్రామం వద్ద రూ.20 కోట్లతో హైలెవల్ వంతెన నిర్మించాల్సి ఉంది. టెండర్ల ప్రక్రియ జరిగి ఏడాది గడిచినా సదరు కాంట్రాక్టర్ వంతెన పనులు చేపట్టలేదు. తాత్కాలికంగా మోటర్‌బైక్‌లు, పాదచారులు వెళ్లేందుకు అవకాశమున్న పాత వంతెనను సైతం ఇటీవల పూర్తిగా నేలమట్టం చేశారు. కాంట్రాక్టర్ సరిగ్గా వర్షాలు కురిసే సమయంలో వంతెనను కూల్చివేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

తాత్కాలిక వంతెనతో ప్రయోజనం శూన్యం..

రెండేళ్ల కిందట కురిసిన భారీ వర్షాలకు తర్నంవాగు ఉప్పొంగి బ్రిడ్జిపై నుంచి వరద పారింది. దీంతో ప్రవాహంలో భారీ వృక్షాలు కొట్టుకొచ్చి ఢీకొట్టడంతో వంతెన పిల్లర్లు కుంగిపోయాయి. బ్రిడ్జి మధ్యలోని కొంత స్లాబ్ బాగం 2023లో కుంగిపోయింది. వంతెనను పరిశీలించిన అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. భారీ వాహనాల రాకపోకలకు అనుమతించకుండా కేవలం ఆటోలు, బైక్‌లు, కాలినడకన ప్రయాణానికి అనుమతించారు. భారీ వాహనాల రాకపోకల కోసం వంతెన అనుకునే కింది భాగంలో రూ.39 లక్షలతో చిన్నపాటి కల్వర్టు పనులు చేపట్టారు. గతేడాది కురిసిన భారీ వర్షాలకు కల్వర్టు కొట్టుకుపోయింది. దీంతో ఆరు నెలల కిందట రూ.4.50 కోట్లను వెచ్చించి సీసీతో కూడిన మూడు అడుగుల తాత్కాలిక వంతెన నిర్మించారు. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే నీటితో వంతెన పూర్తిగా మునిగిపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఇటీవల వాగు దాటే ప్రయత్నంలో జైనథ్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన దత్తు అనే వ్యక్తి వాగులో కొట్టుకుపోయి మృతి చెందాడు.

పనులు చేపడుతాం..

రోడ్డు పనులతో పాటు వంతెన నిర్మాణ పనుల టెండర్‌ను ఒకే కాంట్రాక్టర్ దక్కించుకున్నాడు. తొలుత రోడ్డు విస్తరణ పనులు చేపట్టాడు. ఆ పనులు సాగుతున్నాయి. అయితే తర్నం హైలెవల్ వంతెన నిర్మాణ పనులను చేపట్టేందుకే పాత వంతెనను పూర్తిగా కూల్చివేశాం. 33 మీటర్ల మేర వంతెన పనులు చేపట్టాల్సి ఉండగా పైభాగంలో పనులను కొనసాగిస్తాం. త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటాం.
– సుభాష్ రాథోడ్, నేషనల్ హైవే, డీఈ


బోథ్: బడిబాట ప్రారంభిస్తున్న తహసీల్దార్


తాంసిలో..


సిరికొండ: బడిబాట కార్యక్రమంలో..

బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి


ఇచ్చోడ: బాడిబాటలో పాల్గొన్న పాఠశాల సిబ్బంది


ఇంద్రవెల్లి: అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ఇచ్చోడ: బడీడు పిల్లలను బడిలో చేర్పించేలా విద్యార్థుల తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలని మేడిగూడ ఆశ్రమ పాఠశాల పీజీహెచ్‌ఎం స్వర్ణలత అన్నారు. శుక్రవారం ప్రొఫెసర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మేడిగూడలో గ్రామసభ నిర్వహించి ర్యాలీ చేపట్టారు. ఆమె మాట్లాడుతూ మేడిగూడ క్లస్టర్ పరిధిలో బడీడు పిల్లలను బడికి పంపాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కుంరం సత్యవతి, కోటేశ్, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. కోకస్‌మన్నూర్ జెడ్పీపాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని, ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న నాణ్యమైన విద్యను సద్వినియోగం చేసుకోవాలని ఇంద్రవెల్లి ఆశ్రమ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాథోడ్ ప్రకాశ్ అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో ఆశ్రమ బాలికల పాఠశాలలో గ్రామస్తులతో గ్రామసభ ఏర్పాటు చేశారు. ఉత్తమ బోధనతో పాటు రుచికరమైన భోజనం, రెండు జతల యూనిఫాం, ఉచిత పాఠ్యపుస్తకాలు అందజేస్తామని తెలిపారు. ఎస్‌సీఆర్‌పీ పెందోర్ అర్జున్, ఎస్‌ఎంసీ చైర్మన్ కోవ కోసుబాయి, ఉపాధ్యాయులు పవార్ మదన్, పిల్లల తల్లిదండ్రులు తదితరులు ఉన్నారు.

జైనథ్: బడీడు పిల్లలను బడికి పంపించాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 6 నుంచి 19 వరకు బడిబాట కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం బడిబాట నిర్వహించారు. జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మద్ది లక్ష్మన్న మాట్లాడుతూ బడిబాట కార్యక్రమాన్ని అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు సమన్వయం చేసుకుంటూ విజయవంతం చేయాలని కోరారు. గ్రామపంచాయతీ సెక్రటరీ ముజీబ్, అమ్మఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, అంగన్వాడీలు, ఉపాధ్యాయులు, నారగట్ల రాములు, రవీందర్, దయానంద రెడ్డి, బాబు రావు, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

బోథ్: బోథ్, సొనాల మండలాల్లో బడిబాట కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. సొనాలలో తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. కౌఠ బి గ్రామంలో జెడ్పీఎస్‌ఎస్ పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కుచులాపూర్, ధన్నూర్, మర్లపెల్లి గ్రామాల్లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు.

తాంసి: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్‌కు దీటుగా నాణ్యమైన బోధనతో పాటు విద్యార్థులకు వసతులు అందజేస్తున్నట్లు ఎంపీడీవో గడ్డం మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఉపాధ్యాయులతో కలిసి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈవో శ్రీకాంత్, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కవిత, ఉపాధ్యాయులు శ్రీనివాస్, హాస్టల్ వార్డెన్ సురేందర్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు ఉన్నారు.

సిరికొండ: మండలవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ఎంఈవో సునీల్ ప్రారంభించారు. ముందుగా జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆదిలాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత గల ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందిస్తున్నామని మండల ప్రత్యేకాధికారి పద్మ భూషన్‌రాజు అన్నారు. శుక్రవారం మండలంలో బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలోని యాపల్‌గూడ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్కూల్ కాంప్లెక్స్ ఇన్‌చార్జి హెచ్‌ఎం వినోద్, గంగన్న, తదితరులు పాల్గొన్నారు. మావల మండలంలోని వాఘపూర్ గ్రామంలో నిర్వహించిన బడి బాట కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాత్నాల: బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని హెచ్‌ఎం శశికళ అన్నారు. భోరజ్ మండలంలోని పిప్పరవాడ గ్రామంలో శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం ప్రారంభోత్సవం సందర్భంగా గ్రామసభ నిర్వహించారు. గ్రామపెద్దలు రాజారెడ్డి, ప్రశాంత్ రెడ్డి, పంచాయతీ సెక్రెటరీ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నార్నూర్: పిల్లలను సర్కారు బడిలోనే చేర్పించాలని ఎంపీవో సాయిప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఖైరడట్వా గ్రామంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. పంచాయతీ కార్యదర్శి మమత, గ్రామ పటేల్ నారంజీ తదితరులు పాల్గొన్నారు.


ఆదిలాబాద్‌రూరల్: పిల్లలతో ఉపాధ్యాయులు


సాత్నాల: పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు


నార్నూర్: ఖైరడట్వా గ్రామంలో..

పాఠ్యపుస్తకాల పంపిణీ


పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈవో

ఇచ్చోడ: మండలంలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలకు శుక్రవారం ఎంఆర్సీ కార్యాలయంలో ఎంఈవో కేతవత్ బిక్కు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ముందుస్తుగా పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు పాఠశాలలు పునఃప్రారంమైన రోజున విద్యార్థులకు పంపిణీ చేయాలని కోరారు. ప్రతీ విద్యార్థికి పాఠ్యపుస్తకాలు అందేవిధంగా ప్రధానోపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీఆర్పీలు శ్యాంసుందర్, గంగాభవాని, జగదీశ్వర్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

'కష్టపడి చదివితే లక్ష్యం సులువు'

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాన్ని సులువుగా చేరుకోవచ్చని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంగీత అన్నారు. శుక్రవారం కళాశాలలో కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకొని ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకోవాలన్నారు. లెక్చరర్లు సిల్వర్ రాజు, జగ్‌రాం, జ్యోత్స్న, మంజుల, శ్రావణి, సంతోష్‌కుమార్, రమాకాంత్‌గౌడ్, రవికిరణ్ పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఉచిత కంటివైద్య శిబిరం


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

బోథ్: మండల కేంద్రానికి చెందిన మాసం లక్ష్మి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మాసం అనిల్ కుమార్ శుక్రవారం తన జన్మదినం సందర్భంగా సాయినగర్‌లోని బుడగజంగం కాలనీలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఎస్సై ప్రవీణ్ కుమార్ ప్రారంభించారు. కాలనీవాసులు కంటి పరీక్షలు చేయించుకున్నారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు


తాంసి: రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

తాంసి: భూ సమస్యల పరిష్కారానికే గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ శ్యామలాదేవి తెలిపారు. శుక్రవారం మండలంలోని సావర్గాం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సును అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్‌కుమార్ పరిశీలించారు. సదస్సులో భాగంగా వచ్చిన దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ తహసీల్దార్ గణేశ్, ఏవో రవీందర్, ఆర్ఐ సంతోష్, జూనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర, సర్వేయర్ ప్రసాద్ సిబ్బంది ఉన్నారు.

నార్నూర్: భూభారతి ద్వారా అన్ని మండలాల్లోని గ్రామాల్లో ఈనెల 20 వరకు భూ సమస్య పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఉట్నూర్ సబ్‌కలెక్టర్ యువరాజ్ మర్మాట్ అన్నారు. శుక్రవారం మండలంలోని గుంజాల గ్రామంలో తహసీల్దార్ జాడి రాజలింగు ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. భూ రికార్డులు పరిశీలించి గిరిజన రైతులతో మాట్లాడారు.

సాత్నాల: రెవెన్యూ సదస్సులలో భూ సమస్యలు పరిష్కరించుకోవాలని తహసీల్దార్ విశ్వనాథ్ అన్నారు. శుక్రవారం సైదాపూర్ గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సు కార్యక్రమంలో రైతుల నుంచి వచ్చిన 31 దరఖాస్తులను స్వీకరించారు. ఆర్ఐ సాయిరాం, జూనియర్ అసిస్టెంట్ కామేశ్వర్, రికార్డ్ అసిస్టెంట్ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి


సిబ్బందికి సూచనలు చేస్తున్న కుడ్మేత మనోహర్

ఇంద్రవెల్లి: వర్షకాలంలో గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని ఏజెన్సీ జిల్లా అటనపు వైద్యాధికారి కుడ్మేత మనోహర్ అన్నారు. శుక్రవారం మండలంలోని పిట్టబొంగరం ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలకు మండలంలోని కేస్లాపూర్ రైతువేదికలో సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో మలేరియా, డెంగీ, టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు సంభవించే ఆవకాశాలున్నాయని, గ్రామాల్లో పరిసరాల శుభ్రత, వ్యక్తిగత శుభ్రత పాటించేవిధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు సౌకర్యం లేని గ్రామాల్లో ప్రసవ సమయం దగ్గరున్న గర్భిణీలను గుర్తించి ముందస్తుగా ఆరోగ్య కేంద్రానికి తరలించాలన్నారు. అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వైద్యుడు ప్రతాప్, హెచ్‌ఈవోలు నాందేవ్, గోకుల్, హెల్త్ సూపర్‌వైజర్ జలేందర్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు మార్కౌట్


ఇళ్ల మంజూరు పత్రాలు అందజేస్తున్న అధికారులు

ఇచ్చోడ: మండలంలోని మల్యాల్, జుగునపూర్ గ్రామాల్లో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్లకు ఎంపీడీవో లక్ష్మణ్ ఆధ్వర్యంలో మార్కౌట్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్లకు ఎంపికైన లబ్ధిదారుల ప్రొసీడింగ్‌లు అందజేస్తున్నట్లు తెలిపారు. మార్కౌట్‌లు ఇచ్చిన వెంటనే నిర్మాణాలు చేపట్టేవిధంగా లబ్ధిదారులు ముందుకు రావాలని కోరారు.

బోథ్: బోథ్, కంటెగాం, బాబెర గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు ఎంపీడీవో రమేశ్ శుక్రవారం మంజూరు పత్రాలు అందజేశారు. ఇళ్లు నిర్మించే సమయంలో నియమనిబంధనలు పాటించాలన్నారు. ప్రభుత్వం నాలుగు దశలలో రూ. 5లక్షల ఆర్థిక సాయాన్ని అందిస్తుందని తెలిపారు. ఏపీవో జగ్దేరావ్, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు షేక్ నాజర్ అహ్మద్, మాజీ ఎంపీటీసీ రజియా బేగం తదితరులు ఉన్నారు.

ఇంద్రవెల్లి: రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల ధ్రువీకరణ పత్రాలను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు కలిసి లబ్ధిదారులకు అందించారు. శుక్రవారం మండలకేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో సందర్శించి ఇందిరమ్మ లబ్ధిదారులకు ధ్రువీకరణపత్రాలు అందించారు. ఏఎంసీ చైర్మన్ ముఖడే ఉత్తం , జహీర్, మానిక్‌రావ్, నాగోరావ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్..

దాడి చేసిన ఇద్దరి రిమాండ్

ఆదిలాబాద్‌రూరల్: ఈనెల 2న దాడికి పాల్పడిన ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు మావల సీఐ కర్రె స్వామి తెలిపారు. ఆయన కథనం ప్రకారం మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని దస్నాపూర్ కాలనీకి చెందిన కొండ మహేశ్, కొండ వెంకటేశ్‌లు, అదే కాలనీకి చెందిన మల్లయ్య తల్లిదండ్రులు గంగమ్మ, లస్మన్నలపై దాడికి దిగారు. దీంతో మల్లయ్య ఈనెల 3న ఫిర్యాదు చేయగా నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

బైక్ దొంగ అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: ద్విచక్ర వాహనం చోరీకి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన సాయికిరణ్ భుక్తాపూర్ ప్రాంతంలో గల సీడ్స్‌షాపు ముందు గురువారం తన బైక్ పార్కింగ్ చేయగా భీంపూర్ మండలంలోని నిపాని గ్రామానికి చెందిన అరిగెల మహేశ్ దొంగలించినట్లు పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని శివాజీచౌక్‌లో ఆయనను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

ఆటోను ఢీకొన్న వాహనం

బోథ్: సొనాల మండలంలోని ఘన్‌పూర్ అంతర్రాష్ట్ర రహదారిపై ఆటోను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో మహమ్మద్ రిహాన్(19) మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ ఆరిఫ్‌తో పాటు రిహాన్, రహీమ్‌లు ఆటోలో ఉదయం 2 గంటల ప్రాంతంలో నిర్మల్ నుంచి కిన్వట్ వెళ్తుండగా సొనాల మండలంలోని గుట్టపక్కతండా గ్రామం వద్ద ఉదయం 4 గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వాహనం ఆటోకు ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న రిహాన్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ఆరిఫ్, రహీమ్‌లకు తీవ్రగాయాలయ్యాయి. కాగా సీసీ కెమెరాల సాయంతో పోలీసులు వాహనాన్ని గుర్తించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. సంఘటన జరిగిన మూడు గంటల్లోనే వాహనాన్ని పట్టుకోవడంతో డీఎస్పీ జీవన్ రెడ్డి సీఐ వెంకటేశ్వర రావు, ఎస్సై ప్రవీణ్‌లను అభినందించారు.

యువకుడు అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: ఆన్‌లైన్‌లో మహిళను వేధిస్తున్న యువకుడిని అరెస్టు చేసినట్లు షీటీమ్ ఇన్‌చార్జి ఏఎస్సై బి.సుశీల తెలిపారు. పట్టణంలోని సన్‌షైన్ హబ్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఓ మహిళ ఫిర్యాదుతో మహారాష్ట్రలోని పాఠస్‌కు చెందిన నిందితుడు గొంటిముక్కుల కరణ్‌ను శుక్రవారం మహారాష్ట్ర నుంచి జిల్లాకేంద్రానికి తీసుకొచ్చి వన్‌టౌన్‌లో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నిందితుడు మహిళను వాట్సాప్‌లో వేధించడం, ఫోన్లు చేస్తూ అసభ్య పదజాలంతో తిట్టడంతో సదరు మహిళ షీటీం బృందాన్ని సంప్రదించినట్లు తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలి

ఇచ్చోడ: ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని ఇచ్చోడ సీఐ బండారి రాజు అన్నారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో సాక్షితో మాట్లాడారు. శనివారం నిర్వహించనున్న బక్రీద్ పండుగ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. ఇచ్చోడ, గుడిహత్నూర్, నేరడిగొండ మండల కేంద్రాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు.

గంజాయి పూర్తిగా నిర్మూలించాలి

- ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్

ఉట్నూర్‌రూరల్: గంజాయి, మాదకద్రవ్యాలను సబ్‌డివిజన్ పరిధిలో పూర్తిగా రూపుమాపాలనే దిశగా సబ్ డివిజనల్ పోలీసు యంత్రాంగం పని చేస్తుందని ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉట్నూర్ సబ్ డివిజనల్ పరిధిలో గంజాయి పండించినా, విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సబ్ డివిజన్ పరిధిలో గడిచిన ఐదు నెలల్లో 23 గంజాయి కేసులు నమోదు చేశామని, అందులో 50 మందిని అరెస్టు చేసి జైలుకు పంపినట్లు పేర్కొన్నారు. దాదాపు 18 కిలోల ఎండు గంజాయి, 200 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. గంజాయిపై సమాచారం ఉంటే 87126 59935 నంబర్‌లో సంప్రదించాలన్నారు.